# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

TGTEL/25/A2394

సంపుటి: 03 సంచిక: 114 హైదరాబాద్ బుధవారం 14-10-2026 పేజీలు: 08




## జంతర్ మంతర్‌లో నిరసనకు యత్నం

- ముగ్గురు సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీసులు
- నిరసనలకు అనుమతి లేదని స్పష్టం చేసిన అధికారులు
- ఆంక్షలను ఉల్లంఘించి ఆందోళనకు యత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య షిండే అరెస్ట్
- వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే
- "మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు" అంటూ వ్యాఖ్య
- పోస్టులో ప్రధాని మోదీని ట్యాగ్ చేసిన అభిజీత్ దీప్కే
- ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ దేశవ్యాప్తంగా నిరసనలు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు
- జంతర్ మంతర్, ఈసీ కార్యాలయం, పార్లమెంట్ పరిసరాల్లో భారీ భద్రత

2



## పద్మ అవార్డులతో సీఈసీలకు కాంగ్రెస్ లంచం: పీయూష్ గోయల్

- కాంగ్రెస్ ప్రభుత్వాలపై కేంద్రమంత్రి సంచలన ఆరోపణలు
- పదవీ విరమణ తర్వాత పద్మ అవార్డులు, రాజకీయ పదవులతో ప్రయోజనాలు
- మాజీ సీఈసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని వ్యాఖ్యలు
- ఎన్నికల కమిషనర్ల నియామకాల్లో గతంలో సంప్రదింపులు లేవని విమర్శ
- ప్రధాని మోదీ హయాంలో కమిషనర్లు స్వతంత్రంగా పనిచేస్తున్నారని వెల్లడి
- రాహుల్ గాంధీపై పీయూష్ గోయల్ విమర్శలు
- మాజీ సీఈసీ టీఎన్ శేషన్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని ప్రస్తావన
- ఎంఎస్ గిల్‌కు పద్మ విభూషణ్ ఇచ్చారని వ్యాఖ్య
- 1986లో ఆర్కే త్రివేదిని గుజరాత్ గవర్నర్‌గా నియమించారని వెల్లడి
- 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొత్త చట్టం
- ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు చోటు కల్పించామని వివరణ

2

## జీవో 134 ఒక కుట్ర.. కక్ష సాధింపే



2

- జీవో 134 రాజ్యాంగ విరుద్ధమన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇది కేవలం బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా తెచ్చిన జీవో అని ఆరోపణ
- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి భూములపైనా విచారణ జరపాలని డిమాండ్

## ఎల్బీనగర్ – హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ
- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డీపీఆర్
- పర్వతమాల పథకం కింద తెలంగాణకు ఐదు రోప్‌వేలకు ఆమోదం
- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కేంద్రం సానుకూలత
- సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు ఆమోదం
- తెలంగాణలో 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులపై అధికారులకు ఆదేశాలు
- పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని మంత్రి విజ్ఞప్తి
- కొత్త రహదారులతో రవాణా, పర్యాటక రంగాలకు ప్రయోజనం






## టెక్నాలజీ, డేటా కొందరికే పరిమితం కావొద్దు

కోట్లాది మందికి అవకాశాలు కల్పించాలి
ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రధాని కీలక వ్యాఖ్యలు
పోటీకంటే సహకారం..నియంత్రణకంటే సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపు
ప్రపంచ అనిశ్చితుల మధ్య బలంగా భారత ఆర్థిక వ్యవస్థ ఉందని వెల్లడి
2026-27 తొలి త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధి నమోదైందని ప్రకటన
భారత్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 300 గిగావాట్లకు పెరిగిందని వెల్లడి
ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు అని వ్యాఖ్య
దేశంలో 100కు పైగా భాషలు, వెయ్యికి పైగా శాటిలైట్ టీవీ ఛానళ్లు ఉన్నాయని వివరణ
ప్రజలపై అజమాయిషీ కాదు.. వారిని సాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ వెల్లడి
డిజిటల్ టెక్నాలజీతో భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్‌ను కొందరి ప్రయోజనాలకే పరిమితం చేయకుండా కోట్లాది మందికి కొత్త అవకాశాలు కల్పించేందుకు ఉపయోగించాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పోటీ కంటే సహకారానికి, నియంత్రణ కంటే ప్రజల సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన ఆయన.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

**భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం**

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు మిగతా 2 లో..

## త్వరలో సింగరేణి కార్మికులకు సొంతిల్లు

15 రోజుల్లో కారుణ్య నియామకాలు పూర్తి
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన
మారుపేర్ల సమస్యకు 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం
మెడికల్ ఇన్వ్యాలిడేషన్ పరీక్షలు ఇకపై ఏరియా ఆస్పత్రుల్లోనే
కరోనా సమయంలో డిస్మిస్ అయిన వారికి తిరిగి విధుల్లోకి వచ్చే అవకాశం
సింగరేణి 1,250 ఎకరాల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు
జీవో 76 ప్రకారం ఇళ్ల స్థలాల పంపిణీకి నిర్ణయం
నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరుతో కార్మికులకు ఇళ్ల నిర్మాణం
కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సింగరేణి ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి
సింగరేణి ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
38,738 మంది పర్మనెంట్ ఉద్యోగులు, 29,715 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ప్రయోజనం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** సింగరేణి కార్మికులకు తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. మారుపేర్ల సమస్యకు అదే గడువులో శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కార్మికులకు ఇళ్ల స్థలాల పంపిణీ, కొత్త ఇళ్ల నిర్మాణం, వైద్య సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కార్మికుల సంక్షేమం కోసం పలు మిగతా 2 లో..

## రైతులకు భరోసా ఏదీ? రేవంత్ సర్కారుపై సబిత ఫైర్

రైతులకు కరెంటు, సాగునీరు అందడం లేదని విమర్శ
పంటలు వేయొద్దంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణ
బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌పై ప్రశ్నలు
బహదూర్‌గూడ భూముల సేకరణపై నిలదీత
కొడంగల్ రైతుల పరిస్థితిపై ఆందోళన
రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాల భూసేకరణపై అభ్యంతరం
భూములు అమ్మి పాలన చేస్తున్నారని విమర్శ
నాదర్‌గుల్ భూముల ఆక్రమణలపై ఆరోపణ
కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** తెలంగాణలో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా ఇవ్వడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రైతులకు విద్యుత్, సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. భూసేకరణ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బుల్లెట్ రైలు ప్రతిపాదన, బహదూర్‌గూడ భూముల సేకరణ, కొడంగల్ రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**రైతులకు సాగునీరు ఏదీ?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పంటలు వేయొద్దని చెబుతోందని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. సాగుకు అవసరమైన కరెంటు, నీరు అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలో తాగునీటి సమస్యలను కూడా పరిష్కరించడం లేదని అన్నారు.

**బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌పై ప్రశ్నలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెట్రో మిగతా 2లో..



## డీఎస్సీ-2008 నియామకాలపై పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

- డీఎస్సీ-2008 నియామకాలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- జీవో నంబర్ 28 సవరణను సవాలు చేస్తూ మూడు పిటిషన్లు
- పిటిషన్లు దాఖలు చేసిన డీఎస్సీ, బీఈడీ అభ్యర్థులు
- 2008 డిసెంబర్ నాటి నోటిఫికేషన్ ప్రకారమే ఎంపికలు చేపట్టాలని విజ్ఞప్తి
- నోటిఫికేషన్ తర్వాత రూల్ 7కు నిబంధన జోడించడంపై అభ్యంతరం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన నియామకాలపై వివాదం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కొనసాగిన నియామకాలు
- ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే పోస్టింగ్‌లు
- ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** డీఎస్సీ 2008 నియామకాలపై దాఖలైన మూడు రిట్ పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. జీవో నంబర్ 28ను ప్రభుత్వం సవరించిన విధానాన్ని సవాలు చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు, బీఈడీ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

2008 డిసెంబర్‌లో విడుదలైన అసలు నోటిఫికేషన్ ప్రకారమే మిగతా 2లో..

## రాజ్యాంగవ్యవస్థలను నిర్వీర్యం చేస్తారా?

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీది బాధ్యతా రాహిత్యం
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపణ
రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా రాహుల్ వ్యవహారం
కాంగ్రెస్ ఓటమికి ఈసీ, సీజేఐ బాధ్యత వహించాలా? అంటూ ప్రశ్న
తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని న్యాయవ్యవస్థపై విమర్శలు చేస్తారా?
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని బెదిరిస్తున్నారని ఆరోపణ
భారత్ సోనియా కుటుంబ ప్రైవేట్ ఆస్తి కాదని వ్యాఖ్య
దేశంలో కాంగ్రెస్ నియంతృత్వ రాజకీయాలు సాగవని హెచ్చరిక
పార్లమెంట్‌లో విపక్షాల తీరుపై విమర్శలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారం కోసం న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై కాంగ్రెస్ నేతలు ఒత్తిడి మిగతా 2లో..

## హాస్టళ్ల సరుకుల కేంద్రీకృత టెండర్లు రద్దు చేయాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
పాత విధానంలో సరుకుల సరఫరా చేపట్టాలని సూచన
గురుకులాల టెండర్లను రద్దు చేయాలని డిమాండ్
డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా సరుకుల కొనుగోలు చేపట్టాలని ప్రతిపాదన
కేంద్రీకృత టెండర్లతో చిరు వ్యాపార కుటుంబాల ఉపాధికి నష్టం జరుగుతోందని విమర్శ
బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు టెండర్ కట్టబెట్టారని ఆరోపణ
సబ్ కాంట్రాక్టుల ద్వారా నిబంధనల ఉల్లంఘన జరిగిందని వ్యాఖ్య
జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున రూ.66 కోట్ల గుడ్‌విల్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
బిల్లుల్లో ప్రతినెలా 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** తెలంగాణలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే కేంద్రీకృత పీఎంయూ టెండర్లను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా స్థానిక వ్యాపారుల ద్వారానే సరుకులు సరఫరా చేయాలని సూచించారు. పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకుని, జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ద్వారా నిత్యావసర సరుకుల కొనుగోళ్లు మిగతా 2లో..

# త్వరలో సింగరేణి కార్మికులకు సొంతిల్లు

మొదటిపేజీ తరువాయి

నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు.

**15 రోజుల్లో కారుణ్య నియామకాలు**

సింగరేణిలో ప్రస్తుతం 38,738 మంది పర్మనెంట్ ఉద్యోగులు, 29,715 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. మారుపేర్ల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కూడా త్వరలో పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

**ఇళ్ల స్థలాలు, కొత్త ఇళ్లు**

సింగరేణికి చెందిన 1,250 ఎకరాల భూమిలో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. జీవో 76 ప్రకారం ఈ ప్రక్రియ చేపడతామన్నారు. ఇప్పటికే భూములు ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోనూ అర్హులను గుర్తించి పట్టాలు అందిస్తామని చెప్పారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు నెహ్రూ హౌసింగ్ కాలనీ పేరుతో ఇళ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. అర్హులైన కార్మికులకు ఇళ్లు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**ఏరియా ఆస్పత్రుల్లోనే వైద్య పరీక్షలు**

మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ పరీక్షల కోసం కార్మికులు కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఇబ్బందిని తొలగించేందుకు సింగరేణి ఏరియా ఆస్పత్రుల్లోనే పరీక్షలు నిర్వహించే సదుపాయం కల్పిస్తామని చెప్పారు. దీంతో కార్మికులకు ప్రయాణ భారం తగ్గనుంది. కరోనా సమయంలో విధులకు హాజరుకాకపోవడంతో ఉద్యోగాల నుంచి తొలగించిన వారికి మరో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. వన్‌టైమ్ ఆప్షన్ కింద వారిని తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు**

సింగరేణి ఏరియా ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. సూపర్ స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించడం, వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం, నివాస సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రకటించిన గడువులోగా కారుణ్య నియామకాలు, మారుపేర్ల సమస్య పరిష్కారం ఎంతవరకు పూర్తవుతాయన్నది కీలకంగా మారింది.

# టెక్నాలజీ, డేటా కొందరికే పరిమితం కావొద్దు

మొదటిపేజీ తరువాయి

నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై నిలిచి ఉందని మోదీ అన్నారు. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని తెలిపారు. ఆర్థిక వృద్ధితో పాటు కొత్త అవకాశాలను సృష్టించడంపై భారత్ దృష్టి సారించిందని పేర్కొన్నారు.

హరిత ఇంధన రంగంలోనూ దేశం గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పారు. 2014లో భారత్ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం అది 300 గిగావాట్లకు చేరిందని వివరించారు. స్వచ్ఛ ఇంధన రంగం కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతోందని తెలిపారు.

**ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు**

భారత్‌ను ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా మోదీ అభివర్ణించారు. దేశంలో 100కు పైగా భాషలు, సుమారు 80 వేల వార్తాపత్రికలు, ప్రచురణలు, వెయ్యికి పైగా శాటిలైట్ టీవీ ఛానళ్లు ఉన్నాయని చెప్పారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో 50 కోట్ల మందికి పైగా భారతీయులు చురుగ్గా ఉన్నారని తెలిపారు. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, వాటిపై చర్చించడానికి డిజిటల్ టెక్నాలజీ ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు కొత్త ఆలోచనలకు, వ్యాపార అవకాశాలకు సాంకేతికత తోడ్పడుతోందని వివరించారు.

**ప్రజల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం**

ప్రభుత్వానికి అధికారం ఉన్నంత మాత్రాన ప్రజలపై అజమాయిషీ చెలాయించడం లక్ష్యం కాకూడదని మోదీ అన్నారు. ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడేలా చేయడం కంటే వారు స్వతంత్రంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ప్రజలకు సాధికారత కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.

ఈ దిశగా భారత్ ముందుకు సాగుతోందని తెలిపారు. గత పదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాల జనాభా కంటే ఈ సంఖ్య ఎక్కువని వివరించారు.

**సాంకేతికత అందరికీ అందాలి**

టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్ కొద్దిమందికే ప్రయోజనం చేకూర్చే సాధనాలుగా మిగిలిపోకూడదని మోదీ అన్నారు. వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని సూచించారు. సాంకేతికతను ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు, ఆర్థిక అవకాశాలను విస్తరించేందుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే సాంకేతిక అభివృద్ధి ఫలాలు మరింత మందికి అందుతాయని మోదీ పేర్కొన్నారు. ప్రజలకు అవకాశాలు కల్పించడం, ఆర్థిక వృద్ధిని విస్తరించడం, స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని ఆయన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోంది.

# జంతర్ మంతర్‌లో నిరసనకు యత్నం

- ముగ్గురు సీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీసులు
- నిరసనలకు అనుమతి లేదని స్పష్టం చేసిన అధికారులు
- ఆంక్షలను ఉల్లంఘించి ఆందోళనకు యత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ
- సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య షిండే అరెస్ట్
- వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే
- "మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు" అంటూ వ్యాఖ్య
- పోస్టులో ప్రధాని మోదీని ట్యాగ్ చేసిన అభిజీత్ దీప్కే
- ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ దేశవ్యాప్తంగా నిరసనలు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు
- జంతర్ మంతర్, ఈసీ కార్యాలయం, పార్లమెంట్ పరిసరాల్లో భారీ భద్రత



నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన వేదికగా జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసులు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం ఆందోళనకు యత్నించిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య షిండేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**నిరసనకు యత్నించిన సీజేపీ నేతలు**

జంతర్ మంతర్ వద్ద ఎలాంటి ఆందోళనలు చేపట్టరాదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఆంక్షల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు అక్కడ నిరసన చేపట్టేందుకు ప్రయత్నించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో ముగ్గురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పోస్టు చేశారు. "మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు" అంటూ వ్యాఖ్యానించారు. ఈపోస్టులో ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేశారు.

**ఓటర్ల జాబితాలపై నిరసనలు**

ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు వర్గాలు ఆందోళనలు చేపడుతున్నాయి.

**ప్రధాన ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం**

జంతర్ మంతర్, భారత ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్ పరిసరాల్లో కేంద్ర బలగాలను భారీగా మోహరించారు. నిరసనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలు, వాటిని ఉల్లంఘించేందుకు జరిగిన ప్రయత్నం ఇప్పుడు ఢిల్లీలో చర్చనీయాంశంగా మారాయి.

# రైతులకు భరోసా ఏదీ? రేవంత్ సర్కారుపై సబిత ఫైర్

మొదటిపేజీ తరువాయి

టెండర్లను రద్దు చేసిందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇప్పుడు బుల్లెట్ రైళ్లు తీసుకొస్తామని చెబుతోందని విమర్శించారు. బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. అలైన్‌మెంట్ ఖరారు కాకుండా భూసేకరణ చేపడితే చట్టవిరుద్ధమని కేంద్ర మంత్రి చెప్పారని సబితా తెలిపారు. అలాంటప్పుడు బహదూర్‌గూడలో భూములను ఏ ఉద్దేశంతో సేకరిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు.

**కొడంగల్ రైతుల పరిస్థితిపై ఆందోళన**

కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను సేకరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూములపై ఇంత ఆసక్తి ఎందుకని ఆమె ప్రశ్నించారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి ఎందుకు నిర్మిస్తున్నారని నిలదీశారు. భూములు అమ్మి పాలన సాగించాలని సీఎం భావిస్తున్నారని విమర్శించారు.

**నాదర్‌గుల్ భూములపై ఆరోపణలు**

నాదర్‌గుల్‌లో ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు.

రైతుల భూములు, సాగునీరు, తాగునీరు వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. భూసేకరణ, బుల్లెట్ రైలు అలైన్‌మెంట్, నాదర్‌గుల్ భూముల ఆక్రమణలకు సంబంధించి ఆమె చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

# హాస్టళ్ల సరుకుల కేంద్రీకృత టెండర్లు రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి

చేపట్టాలని కోరారు.

**స్థానిక వ్యాపారులకు ఉపాధి దూరం**

కేంద్రీకృత టెండర్ల విధానం వల్ల వేలాది మంది చిరు వ్యాపారులు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హరీశ్‌రావు అన్నారు. స్థానిక వ్యాపారుల ద్వారా సరుకులు కొనుగోలు చేస్తే విద్యార్థులకు తాజా, నాణ్యమైన వస్తువులు అందుతాయని పేర్కొన్నారు. పాత విధానాన్ని కొనసాగించడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా నిలుస్తాయని చెప్పారు.

**కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణ**

ప్రభుత్వ పెద్దలు కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు టెండర్ కట్టబెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా సబ్ కాంట్రాక్టులు ఇస్తున్నారని విమర్శించారు. జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.66 కోట్ల గుడ్‌విల్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిల్లుల్లో ప్రతినెలా 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి వివరణ రావాల్సి ఉంది.

**అధిక ధరలకు టెండర్లు**

**ఖరారు చేశారని విమర్శ**

స్థానిక వ్యాపారులు ఇచ్చే ధరల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు కాంట్రాక్టులు ఖరారు చేశారని హరీశ్‌రావు విమర్శించారు. అయినప్పటికీ హాస్టళ్లకు సరుకులు సకాలంలో అందడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరాలో జాప్యం జరగడం ప్రభుత్వ నిర్వహణ లోపాన్ని చూపుతోందని అన్నారు.

**పాత విధానాన్ని పునరుద్ధరించాలి**

ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసి మూడు నెలల్లోనే విఫలమైందని తాను చెబుతున్న కేంద్రీకృత సరఫరా విధానాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ టెండర్లను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం స్పందించకపోతే బాధిత కుటుంబాలు, విద్యార్థుల తరఫున బీఆర్ఎస్ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు. స్థానిక వ్యాపారులకు ఉపాధి కల్పించడంతో పాటు హాస్టళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన సరుకులు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

# డీఎస్సీ-2008 నియామకాలపై పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

డీఎస్సీ2008 ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని పిటిషనర్లు కోరారు. ఇందుకు సంబంధించి అధికారులను ఆదేశించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

నోటిఫికేషన్ విడుదలైన తర్వాత జీవో నంబర్ 28ను జారీ చేసి, రూల్ 7కు అదనపు నిబంధనను చేర్చడం సరికాదని బీఈడీ అభ్యర్థులు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎంపిక ప్రక్రియపై ప్రభావం పడిందని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ పిటిషన్లపై సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన అనంతరం ఆయా ప్రభుత్వాలు నియామక ప్రక్రియను కొనసాగించాయని పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటికే పోస్టింగ్‌లు కూడా ఇచ్చిన నేపథ్యంలో జీవో నంబర్ 28 సవరణ అంశంపై ఇప్పుడు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది.




# పద్మ అవార్డులతో సీఈసీలకు కాంగ్రెస్ లంచం

- కాంగ్రెస్ ప్రభుత్వాలపై కేంద్రమంత్రి సంచలన ఆరోపణలు
- పదవీ విరమణ తర్వాత పద్మ అవార్డులు, రాజకీయ పదవులతో ప్రయోజనాలు
- మాజీ సీఈసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని వ్యాఖ్యలు
- ఎన్నికల కమిషనర్ల నియామకాల్లో గతంలో సంప్రదింపులు లేవని విమర్శ
- ప్రధాని మోదీ హయాంలో కమిషనర్లు స్వతంత్రంగా పనిచేస్తున్నారని వెల్లడి
- రాహుల్ గాంధీపై పీయూష్ గోయల్ విమర్శలు
- మాజీ సీఈసీ టీఎన్ శేషన్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని ప్రస్తావన
- ఎంఎస్ గిల్‌కు పద్మ విభూషణ్ ఇచ్చారని వ్యాఖ్య
- 1986లో ఆర్కే త్రివేదిని గుజరాత్ గవర్నర్‌గా నియమించారని వెల్లడి
- 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొత్త చట్టం
- ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు చోటు కల్పించామని వివరణ



నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):

ఎన్నికల కమిషనర్లకు పద్మ అవార్డులు, రాజకీయ పదవులు ఇవ్వడం ద్వారా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వారిని ప్రలోభపెట్టాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఎన్నికల కమిషనర్లు స్వతంత్రంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

మంగళవారం మీడియాతో మాట్లాడిన పీయూష్ గోయల్.. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన కొందరికి పదవీ విరమణ తర్వాత రాజకీయ పదవులు, పద్మ అవార్డులు ఇచ్చారని ఆరోపించారు. ఈ విధంగా వారికి ప్రయోజనాలు కల్పించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ విషయంలో రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు.మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని గోయల్ గుర్తు చేశారు. అలాగే మాజీ సీఈసీ ఎంఎస్ గిల్‌కు పద్మ విభూషణ్ పురస్కారం ఇచ్చారని పేర్కొన్నారు. 1986లో ఆర్కే త్రివేదిని గుజరాత్ గవర్నర్‌గా నియమించారని తెలిపారు. ఎన్నికల కమిషనర్ల నియామకాల్లో గతంలో సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపేవారు కాదని విమర్శించారు. ఈ పరిస్థితులను మార్చేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని పీయూష్ గోయల్ తెలిపారు. ఈ చట్టం ప్రకారం ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు కూడా స్థానం కల్పించామని వివరించారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న సమయంలో పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే కాంగ్రెస్‌పై ఆయన చేసిన ఆరోపణలను స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు ఈ వార్తా కథనంలో ప్రస్తావించలేదు.

# రాజ్యాంగవ్యవస్థలను నిర్వీర్యం చేస్తారా?

మొదటిపేజీ తరువాయి

తెస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యత వహించాలా? అని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ తీరుపై మండిపాటు**

పార్లమెంట్‌లో విపక్షాలు వ్యవహరించిన తీరును దేశ ప్రజలు చూశారని కిషన్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్‌పై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి ద్రోహం చేస్తున్నారంటూ ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు.

**ఈసీ, సీజేఐ బాధ్యత వహించాలా?**

ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యత వహించాలా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థపై ఉందా? అని నిలదీశారు. తమకు అనుకూలంగా ఆదేశాలు రాలేదనే కారణంతో సీజేఐపై విమర్శలు చేయడం, ఆయన పదవి నుంచి దిగిపోవాలని కోరడం సరికాదని అన్నారు.

**కాంగ్రెస్ మార్కు రాజకీయాలు సాగవు**

భారత్ సోనియా కుటుంబానికి చెందిన ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి కాదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నియంతృత్వ రాజకీయాలు సాగవని హెచ్చరించారు. రాజ్యాంగ వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన విమర్శించారు. రాజ్యాంగ సంస్థలపై విమర్శలు, వాటి నిర్ణయాలపై రాజకీయ పార్టీల అభ్యంతరాలు దేశ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ తీరుపై కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఎల్బీనగర్ హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణలో కీలక రహదారులు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం నుంచి పలు సానుకూల నిర్ణయాలు వెలువడ్డాయి. ఎల్బీనగర్‌హయత్‌నగర్ మధ్య డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా అంగీకారం తెలిపారు. తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో గడ్కరీతో సమావేశమై రాష్ట్రంలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై చర్చించారు.

**ఎల్బీనగర్-హయత్‌నగర్ కారిడార్‌కు ఆమోదం**

హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు గడ్కరీ ఆమోదం తెలిపినట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే నగరంలో రాకపోకలు మరింత సులభమయ్యే అవకాశం ఉంది.

**కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి**

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. ఈ వంతెన ద్వారా జాతీయ రహదారి 167కే పరిధిలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అనుసంధానం మెరుగుపడుతుందని కోమటిరెడ్డి చెప్పారు. రవాణా సౌకర్యాలతో పాటు పర్యాటక రంగానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

**హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై కొత్త డీపీఆర్**

హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారి 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కోమటిరెడ్డి కోరారు. దీనిపై స్పందించిన గడ్కరీ కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీపీఆర్ ఆధారంగా ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, నిర్మాణ వ్యయం తదితర అంశాలపై తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**ఐదు రోప్‌వేలకు ఆమోదం**

పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. పర్వత ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడం సులభం చేయడంలో రోప్‌వేలు ఉపయోగపడనున్నాయి. హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్ఓబీలు) నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

**34 పనులకు నిధుల కోసం విజ్ఞప్తి**

తెలంగాణలో 34 రహదారి పనులకు కేంద్ర రహదారుల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి నిధులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి కోరారు. దీనిపై స్పందించిన గడ్కరీ కేంద్ర అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని పలు రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కూడా మంత్రి విజ్ఞప్తి చేశారు. పుల్లూరు, అలంపూర్, జట్రపోలు, పెంట్లవెల్లి, కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట, డిండి, దేవరకొండ, మల్లేపల్లి, నల్గొండ మీదుగా ఉన్న రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి సమావేశంలో చర్చించిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే తెలంగాణలో రహదారి అనుసంధానం మెరుగుపడే అవకాశం ఉంది. అయితే ఆయా పనుల నిర్మాణం, నిధుల కేటాయింపు, కాలపరిమితిపై తదుపరి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.

# జీవో 134 ఒక కుట్ర.. కక్ష సాధింపే

- జీవో 134 రాజ్యాంగ విరుద్ధమన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- ఇది కేవలం బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా తెచ్చిన జీవో అని ఆరోపణ
- సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి భూములపైనా విచారణ జరపాలని డిమాండ్



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ఆయన విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు.

సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారని, చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని వాపోయారు.

భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ట్రూ, అప్ చార్జిల పేరుతో ప్రజల నడ్డివిరిచే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- **రైతులకు 24 గంటల విద్యుత్ అందించి పంట పొలాలను కాపాడాలి**
- **కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలి సిపిఎం**
- **కోమటిరెడ్డి చంద్రారెడ్డి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు**

**యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 13(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో ప్రజలపై ట్రూఅప్ చార్జిల రూపంలో భారం మోపే విధంగా విద్యుత్ చార్జిల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బీబీనగర్ కరెంట్ AE కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఏ ఈ మనోహర్ రెడ్డి గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంలకు 7,635 కోట్లు ట్రూ,అప్ చార్జిల పేరుతో నష్టాలను పూడ్చుకునేందుకు అదనపు వసూళ్ల రూపంలో 2026 నవంబర్ నెలలో యూనిట్ కు 30 పైసలు డిసెంబర్ నెల బిల్లు నుండి 50 పైసల చొప్పున పెంచాలని డిస్కంలు నిర్ణయించడం, సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డివిరచడమేనని ఈ పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ తో పాటు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు కరెంట్ చార్జిల పెంపుతో వారి బ్రతుకులు మరింత భారంగా మారుతాయని అన్నారు. ప్రభుత్వ శాఖల నుండి డిస్కంలకు రావలసిన బకాయిలను రాబట్టడంలో విఫలమైన ప్రభుత్వం, అబారాలను ప్రజల మీదకు నెట్టడం సరికాదని తక్షణమే యూనిట్ల మీద అదనపు విద్యుత్ చార్జిల పెంపు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్న ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్న సమయంలో కనీసం బావులు బోర్ల కింద సాగు చేసుకుంటున్న రైతులకైనా నిరంతర విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బోర్ల కింద నాట్లు వేసిన రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో నీరు అందక నాటుపెట్టిన వరి పొలాలు కళ్ళ ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కరెంటు ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియక రైతులు రాత్రింబవళ్లు పొలాల వద్ద పడికాపులు రాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ తో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ లైన్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. పంటలు చేతికొచ్చే దశలో విద్యుత్ కోదలతో రైతులు నష్టపోవడం అత్యంత బాధాకరమన్నారు.ఇప్పటికి కరెంటు నీటి కొరత కారణంగా ఎండిపోయిన పంటలను ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయాలని డిమాండ్ చేశారు.ఎండిపోయిన ప్రతి ఎకరా పంటకు రూ,30 వేలు ఇతర పంటలకురూ,20 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు కరువు ప్రభావిత గ్రామాలను గుర్తించి ప్రత్యేక గ్రంథాలతో పంట నష్టం అంచనా వేయాలని తాగునీరు పశువులకు నీరు పశుగ్రాసం వంటి అత్యవసర ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు రైతులు అప్పులు చేసి సాగు పెట్టుబడును పెట్టారని పంటలు ఎండిపోతే వారి కుటుంబాల జీవనమే సంక్షోభంలో పడుతుందని తెలిపారు రైతులను ఆదుకుంటామని ప్రకటనలు చేయడం కాకుండా ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలోకి వచ్చే పరిస్థితిలను పరిశీలించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్,పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు రేసు రామచంద్రారెడ్డి,పొట్ట యాదమ్మ, మేకల బాబు,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్,మందకిరణ్,పంజాల జంగయ్య,ఆకునూరి రాజమౌళి, గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.






# 31వ వార్డులో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**యాదాద్రి భువనగిరి,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

భువనగిరి మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు బంజారాహిల్స్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని కోరుతూ 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు కి వినతిపత్రం అందజేశారు.

గత నెల రోజులుగా బంజారాహిల్స్ ప్రాంతంలో విద్యుత్ శాఖకు సంబంధించిన లైన్‌మన్ లేకపోవడంతో ప్రజలు విద్యుత్ సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు, విద్యుత్ లైన్లలో మరమ్మతులు అవసరమైనప్పుడు సమస్యలను సకాలంలో పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు.

ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ ప్రాంతానికి వెంటనే లైన్‌మన్‌ను నియమించి, ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లుని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సేవలు అందించడంతో పాటు, విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే 31వ వార్డులో విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజలకు విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు ఎదురుకాకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి, లైన్‌మన్ పోస్టును భర్తీ చేయడంతో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్, బానోత్ జ్యోతి, బానోత్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు.

# రూ.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మెట్టు తహసీల్దార్,మండల సర్వేయర్!

- **లేఅవుట్ అనుమతుల కోసం రూ.30 లక్షల డిమాండ్..**
- **చివరకు రూ.20 లక్షలకు బేరం**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టు మండల తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. అధికారిక పని చేసిపెట్టేందుకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి లేఅవుట్‌కు సంబంధించి హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేసేందుకు నిందిత అధికారులు తొలుత రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు తగ్గించినట్లు వారు పేర్కొన్నారు.

**సర్వేయర్ వద్ద నగదు స్వాధీనం**

2026 అక్టోబర్ 12న సాయంత్రం ఏసీబీ సిటీ యూనిట్ అధికారులు వలపన్ని, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 లక్షలు స్వీకరిస్తుండగా పట్టుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. బి.తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి సూచనల మేరకే ఈ మొత్తాన్ని తీసుకున్నట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు.సర్వేయర్ వద్ద నుంచి ఆయన చూపిన స్థలంలో లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. రసాయన పరీక్షలో సర్వేయర్ రెండు చేతుల వేళ్లకు పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు పేర్కొంది.

**కోర్టుకు నిందితులు.. దర్యాప్తు కొనసాగింపు**

ప్రభుత్వ ఉద్యోగులుగా తమ విధులను నిజాయితీగా నిర్వర్తించకుండా అక్రమంగా వ్యవహరించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితులైన మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు, తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డిని అరెస్టు చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని అవినీతి నిరోధక కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి భద్రతా కారణాల దృష్ట్యా ఆయన వివరాలను వెల్లడించడం లేదని ఏసీబీ స్పష్టం చేసింది.

**ప్రజలకు ఏసీబీ అధికారుల సూచన**

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు, వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



# పట్టభద్రుల ఓటర్ల నమోదే లక్ష్యంగా ముందుకు సాగాలి

- **కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం**
- **ఢిల్లీలో సీఎంతో డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ భేటీ**
- **అర్హులైన పట్టభద్రులందరి ఓటరు నమోదు చేయించాలని ఆదేశం**

**పెద్దేముల్,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి-హైదరాబాద్-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంతో ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని,ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు,డీసీసీ అధ్యక్షులు హాజరయ్యారు.ఈ సమావేశంలో వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్,జిల్లా ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్ రెడ్డి, బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి-హైదరాబాద్-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వికారాబాద్ జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.పార్టీ నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా,క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా తీసుకుని జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి,వారిని ఓటర్లుగా నమోదు చేయించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకత్వం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.



# ఎస్ఐఆర్ వ్యతిరేక నిరసనలో వంశీరాజ్

**వలిగొండ,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకుల సోమవారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు చేగూరి వంశీరాజ్ ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ వ్యతిరేక నిరసనలో పాల్గొన్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలపై జవాబుదారీతనం కోరుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలో చేపట్టిన నిరసనలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి వంశీరాజ్ పాల్గొన్నారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల కాపాడటానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భువనగిరి అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ బట్టు సందీప్,ఎన్ఎస్‌యూఐ భువనగిరి అసెంబ్లీ అధ్యక్షుడు గొల్లపల్లి వినయ్,యూత్ కాంగ్రెస్ నాయకుడు నారగోని మురళి తదితరులు పాల్గొన్నారు.



# వలస బాట పట్టిన వ్యవసాయ కూలీలు,రైతులు.

**గోనెగండ్ల,అక్టోబర్ 13(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రమైన గోనెగండ్లలో రైతులు కూలీలు బ్రతుకుతెరువుకై వలస బాట పట్టారు. తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడంతో పశ్చిమ ప్రాంతంలోని కూలీలు, రైతులు వలసబాట పట్టారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో పనులు లేకపోవడంతో గోనెగండ్లతో పాటు చుట్టుపక్కల వివిధ గ్రామాల నుంచి గత ఐదు రోజుల్లో వందలాది కుటుంబాలు మూటముల్లె సర్దుకొని బొలెరో వాహనాల్లో సంగారెడ్డిలోని షాబాద్, గుం టూరు, మహబూ బ్ నగర్,ముంబై, బెంగుళూరు తదితర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు లేక వేసిన పంటలు దిగుబడి రాక పెట్టుబడి కూడా కానరాక పోవడంతో చేసిన అప్పులు తీర్చుకునేందుకు ఆది, సోమ వారాల్లో గోనెగండ్లలోని ఎస్సీ కాలనీ వాసులు ప్రతిరోజు రెండు బొలెరోలలో ఇతర ప్రాంతాలకు సుమారు 30 కుటుంబాలు చదువుకునే పిల్లలను కూడా తమ వెంట తీసుకుని బయలుదేరాయి. స్థానికంగా ఉపాధి పనులు కూడా లేకపోవడంతో అక్కడ ఏదో ఒక పని చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటామని వ్యవసాయ కూలీలు, రైతులు చెబుతున్నారు. అధికారులు గ్రామంలోనే ఉపాధి పనులు కల్పిస్తే బాగుంటుందని ప్రజలు వాపోతున్నారు.




# పాఠశాల అభివృద్ధికి సహకారం – గ్రామస్తుల హర్షం

**నంద్యాల,అక్టోబర్13 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల జిల్లాజూపాడుబంగ్లా మండలంలోని,కనకయ్యకొట్టాల గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు దొడ్డ సుధాకర్ చౌదరి తన సొంత ఖర్చుతో రంగులు వేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల మొత్తం అందంగా కనిపించేలా రంగులు వేయించేందుకు ఆయన మొత్తం రూ.40,000 ఖర్చు చేశారు.

పాఠశాల అభివృద్ధి కోసం ఆయన చేసిన ఈ సేవా గ్రామంలో ప్రజల ప్రశంసలు అందుకుంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

రంగుల, కూలీల, ఇతర ఖర్చులు మొత్తం రూ.40,000/ అయింది అన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైదర్ బీ మాట్లాడుతూ పాఠశాలకు రంగులు వేయించి అభివృద్ధికి సహకరించిన దొడ్డ సుధాకర్ చౌదరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి పట్ల ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. దొడ్డ సుధాకర్ చౌదరి చేసిన ఈ సేవ అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శావ వెంకటయ్య,పాఠశాల చైర్మన్ పరమేశ్వరుడు,మాజీ చైర్మన్ బ్రహ్మయ్య ఆచారి,హరి, డాక్టర్ శివచారి,మద్దిలేటి, గుట్టుపల్లి పిచ్చయ్య,మంగలి మాలకొండయ్య,సామేలు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# విద్యుత్ కోతలను ఎత్తివేయాలి

- **సీపీఎం**

**వలిగొండ,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

విద్యుత్ కోతలను ఎత్తివేసి 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, ట్రూఅప్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం 6 నుంచి 8 గంటలే విద్యుత్ అందిస్తోందని, కోతలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. వెంటనే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రూ.7,635 కోట్ల ట్రూఅప్ చార్జీల వసూలుతో వినియోగదారులపై అదనపు భారం పడనుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసలు అదనంగా వసూలు చేయడం పేద, మధ్యతరగతి ప్రజలకు భారమవుతుందని పేర్కొన్నారు. చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం,ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలీస్ ఐక్యతకు ప్రతీకగా 'బడా ఖానా' కార్యక్రమం

**వలిగొండ,అక్టోబర్ 13(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాష్ యాదవ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో 'బడా ఖానా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే పోలీస్ సిబ్బందికి మానసిక ఉల్లాసం కల్పించడం, కుటుంబాలతో ఆహ్లాదకరంగా గడిపే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, నమ్మకం, సహకారంతో పని చేయాలని సూచించారు. సమర్థవంతమైన సమాచార మార్పిడి, సమన్వయం, పరస్పర సహకారం ద్వారా పోలీస్ శాఖ పనితీరు మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఐక్యత,ఆత్మీయ అనుబంధాలను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని తెలిపారు.




## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- **గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం**

**శంషాబాద్,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

చౌదరిగుడ గ్రామం అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండల పరిధిలోని చౌదరిగుడ గ్రామంలో సిసి రోడ్డు పనులకు సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం భూమి పూజ నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ రాజ్, నర్కూడ సర్పంచ్ శేఖర్, సబిత, మంజుల, అరుణ, జయమ్మ, రాజు, మోహన్ రావు, మల్లేష్, పెంటయ్య,ఆంజనేయులు గౌడ్, చింటూ, విజయ్ కుమార్, రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నేడు జుంటిపల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు శ్రీకారం.

- **రూ.5.71 కోట్ల నిధులులతో శంకుస్థాపన.**
- **ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**

**యాలాల,అక్టోబర్ 13(ప్రజాక్షేత్రం):**



యాలాల మండలంలోని జుంటిపల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు శ్రీకారం నేడు ఉదయం 9:30 కు చుట్ట నున్నారు. అదేవిధంగా స్థానిక సర్పంచ్ వాణిశ్రీ అధ్యక్షత కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఇట్టి కార్యక్రమానికే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. రూ. 5.71 కోట్ల నిధులతో జుంటిపల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలియజేశారు.ఇరిగేషన్ శాఖ అధికారులు,వివిధ శాఖల అధికారులు,పిఎసిఎస్ చైర్మన్, మాజీ పిఎస్ సి ఎస్ చైర్మన్ జీ. సురేందర్ రెడ్డి,సర్పంచులు, పిఎసిఎస్ డైరెక్టర్లు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బాధిత కుటుంబానికి నిరంజన్‌రెడ్డి పరామర్శ.

- **బలిజపల్లిలో బీఆర్ఎస్ నాయకుడి మృతికి నివాళులు.**
- **ఏదుట్లలో వధువును ఆశీర్వదించిన మాజీ మంత్రి.**

**వనపర్తి,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

మాజీ మంత్రి,బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం వనపర్తి జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్దమందడి మండలం బలిజపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, తన బంధువు మారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఆయన గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అనంతరం గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు చెటమోని బాలరాజు, తిరుపతమ్మ దంపతుల కుమార్తె సజన వివాహ ప్రధాన వేడుకకు నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వధువును ఆశీర్వదించి, నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఏదుట్లలో జరిగిన వివాహ వేడుకలో మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి,ఉపసర్పంచి రాజేశ్ ఆచారి,కిషన్‌రావు,మాజీ ఉపసర్పంచి క్రాంతిరావు,మాజీ వార్డు సభ్యుడు విష్ణు,ప్రస్తుత వార్డు సభ్యుడు యాదగిరి, భాషవన్,శేఖర్,చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కార్యదర్శి లేని పంచాయతీ..గాడి తప్పిన పాలన!

- **మూడు నెలలుగా ఇంచార్జి కార్యదర్శి కోసం ఎదురుచూపులు**
- **పక్షం రోజులకే పరిమితమవుతున్న పర్యవేక్షణ.. ప్రజలకు తప్పని తిప్పలు**
- **పింఛన్ల ఆన్‌లైన్ ప్రక్రియకూ ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి**
- **బండమీదిపల్లికి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలంటున్న ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు**

**పెద్దేముల్,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

గ్రామ పంచాయతీకి కార్యదర్శి లేకపోతే పాలన ఎలా సాగుతుంది? ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేదెవరు? ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించేదెవరు? పెద్దేముల్ మండల పరిధిలోని బండమీదిపల్లి గ్రామపంచాయతీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఈ ప్రశ్నలకు అద్దం పడుతున్నాయి.దాదాపు మూడు నెలలుగా పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో గ్రామ పాలనపై ప్రతికూల ప్రభావం పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారి తరచూ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థాయి పనుల కోసం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

**పంచాయతీకి కార్యదర్శి కరువు..**

**పాలనకు ఆటంకం!**

బండమీదిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన మొగులేష్ అడికిచర్ల గ్రామపంచాయతీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో తట్టేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న గోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఫిబ్రవరి నెలలో బండమీదిపల్లి పంచాయతీ బాధ్యతలు చేపట్టిన గోపాల్.. రెండు గ్రామపంచాయతీల విధులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో బండమీదిపల్లి గ్రామానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. గత మూడు నెలల వ్యవధిలో ఆయన బండమీదిపల్లికి కేవలం 10 నుంచి 15 రోజులే వచ్చారని తెలుస్తోంది. ఇంచార్జి వ్యవస్థలో పరిపాలన సాగుతుండటంతో గ్రామస్థాయి సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**రెండు పంచాయతీలు.. ఒకే కార్యదర్శి!**

తట్టేపల్లి గ్రామపంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా ఉన్న గోపాల్‌కు బండమీదిపల్లి అదనపు బాధ్యతలు అప్పగించడంతో రెండు గ్రామాల మధ్య విధుల నిర్వహణ సవాలుగా మారింది. ఒకే అధికారి రెండు పంచాయతీలను పర్యవేక్షించాల్సి రావడంతో బండమీదిపల్లి ప్రజలకు అవసరమైన సమయంలో కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామ పంచాయతీకి సంబంధించిన పనులు, ప్రజల దరఖాస్తులు, ప్రభుత్వ పథకాల అమలు, ఇతర పరిపాలనా వ్యవహారాల కోసం కార్యదర్శిని కలవాల్సి వచ్చినప్పుడు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పాలన నిరంతరాయంగా సాగాలంటే ప్రజలకు అందుబాటులో ఉండే పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శి అవసరమని అభిప్రాయపడుతున్నారు.




**పింఛన్ల ఆన్‌లైన్ పనులకూ ఇబ్బందులే!**

గ్రామంలో పింఛన్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో ఇతరుల సహకారంతో పూర్తి చేయించాల్సి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.కీలకమైన ప్రభుత్వ సేవలకు సంబంధించిన పనులే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటే సాధారణ ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడం వల్ల ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయి? ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి? అనే అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల దృష్టికి సమస్య..**

**పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలి!**

గ్రామ పంచాయతీ అనేది ప్రజలకు అత్యంత చేరువలో ఉండే పరిపాలనా వ్యవస్థ.అలాంటి వ్యవస్థలో కీలకమైన కార్యదర్శి పోస్టు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం గ్రామాభివృద్ధి, ప్రజాసేవల నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉంది. బండమీదిపల్లి గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి, గ్రామపంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.ఇంచార్జి వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపి, గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బండమీదిపల్లి గ్రామపంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిని నియమిస్తారా? లేక గ్రామస్తుల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.

## మండల కాంగ్రెస్ సేవా దాల్ అధ్యక్షులు శ్రీనివాస్ కి ఘన సన్మానం

- **అభినందించి శుభాకాంక్షలు తెలిపిన కోహిర్ అధ్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్**

**జహీరాబాద్,అక్టోబర్ 13 ( ప్రజాక్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా శాసన సభ పరిధిలో భాగమైన కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా ఎన్నికైన పుర శ్రీనివాస్ మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల అధ్యక్షులు సువర్ణ మల్లన్న పటేల్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్లన్న పటేల్ పుర శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వాదం అందించారు. అనంతరం తనపై నమ్మకంతో సేవాదళ్ మండల అధ్యక్ష బాధ్యతలు చేపట్టే అవకాశం కల్పించినందుకు, తనను సన్మానించి ఆశీర్వదించినందుకు పుర శ్రీనివాస్ మల్లన్న పటేల్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సేవలో ముందుంటూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోహిర్ మండలం సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు పోచారం అశోక్,మనియర్ పల్లి మాజీ అధ్యక్షులు రమేష్,మాజీ ఎంపిటిసి మున్నూర్ రాజు, చంద్రశేఖర్ రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## చేవెళ్లలో ఆర్ఎస్ఎస్ ప్రారంభిక్ శిక్షా వర్గ్

- **రెండు రోజుల శిక్షణలో పాల్గొన్న 100 మంది బాలలు**

**చేవెళ్ల,అక్టోబర్ 13(ప్రజాక్షేత్రం) :**

చేవెళ్ల ఖండ్ (షాబాద్) ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రారంభిక్ శిక్షా వర్గ్‌ను చేవెళ్లలోని వివేకానంద కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సుమారు 100 మంది బాలలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలలకు క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సమయపాలన, సంఘటితంగా పనిచేయడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. బాలల్లో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా వర్గ్ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలలు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ పొందారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా బాలలను తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.



## ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసనచేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

- **డీఈవోకు బీజేపీ నాయకుల వినతి**

**వనపర్తి,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ vవనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

**ఉపాధ్యాయుల బాధ్యతను గుర్తించాలి**

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు రాజ్యాంగబద్ధ సంస్థల పట్ల గౌరవంతో, చట్టాలు, సేవా నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతోపాటు క్రమశిక్షణ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలను బోధించాల్సిన ఉపాధ్యాయులు తమ ప్రవర్తనతోనూ ఆదర్శంగా నిలవాలని సూచించారు.

**నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరపాలి**

వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో శనివారం కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని బీజేపీ నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు, సేవా నియమావళికి అనుగుణంగా వ్యవహరించారా లేదా అన్నది పరిశీలించాలని పేర్కొన్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ కొండోజు గోపీనాథ్,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి పెద్దేముల్‌లో శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం!

- **తొలిరోజు వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక క్రతువులకు శ్రీకారం**
- **ధ్వజస్తంభ ప్రతిష్ఠ..శిఖర స్థాపనకు సర్వం సిద్ధం**
- **వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు..హోమాలు**
- **రేపు (గురువారం) సీతారాముల కల్యాణం.. భక్తులకు మహా అన్నదానం**

**పెద్దేముల్,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**

వేద మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక సందడి..భక్తి పారవశ్యాన్ని నింపే పూజా కార్యక్రమాలతో పెద్దేముల్ మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.ఆలయ సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన,శిఖర స్థాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం తొలిరోజు వైదిక క్రతువులకు శ్రీకారం చుట్టనున్నారు.రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న ఈ మహోత్సవాల కోసం ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేయడంతో పాటు గ్రామ,పెద్దలు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వస్తివాచనంతో మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం గణపతి పూజ,గోపూజ, పుణ్యాహవాచనం,ఋత్విగ్వరణం, రక్షాబంధనం,అఖండ దీపారాధన, మాతృకా పూజ,నాందీ తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.అనంతరం అంకురారోపణం,సర్వతోభద్ర మండల దేవతా స్థాపన,వాస్తు పీఠస్థాపన, నవగ్రహ మండల దేవతా స్థాపన, యోగిని పీఠస్థాపన,మండప సంస్కారం వంటి విశిష్ట వైదిక క్రతువులు జరగనున్నాయి.తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా ప్రతిమా శోధనం,ప్రాసాద సంస్కారం,జలాధివాసం,ధాన్యాధివాసం,మూలమంత్ర హోమం ,శయ్యాధివాసం తదితర పూజా క్రతువులను నిర్వహించనున్నారు.వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగే ఈ కార్యక్రమాలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.స్వామివారి అనుగ్రహం పొందేందుకు స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ వేడుకల్లో పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన,శిఖర స్థాపన కార్యక్రమాలతో పాటు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి,చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి లు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెద్దేముల్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.



# జిపి సెక్రెటరీని నిర్బంధించిన గ్రామస్తులు

- నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం హంగర్గా గ్రామంలో ఘటన
- ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నాడని ఆరోపణ
- డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నాడని మండిపడ్డ గ్రామస్తులు

**బాన్సువాడ,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**





గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నాడని, నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సెక్రెటరీని గ్రామపంచాయతీలో నిర్బంధించి తాళం వేసిన ఘటన నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగార్గ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.... గ్రామపంచాయతీ సెక్రెటరీ గంగారాం నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్ లు కేటాయిస్తున్నారని ఆరోపించారు.ఒకరి ఇళ్లు ట్యాక్స్ లు వేరేవాళ్లకు రాసి ఇస్తున్నారని అన్నారు.ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్ ఎలా ఇచ్చి ట్యాక్స్ రిసిప్ట్ చింపారని ప్రశ్నించారు. సెక్రెటరీ ఏజెంట్లను పెట్టి కలెక్షన్ చేస్తున్నారని అన్నారు.జీపీ స్టాఫ్ పేరు పై గతంలో ఖర్చులు చేసినబిల్లులు వేసి రూ.3లక్షలు డ్రా చేశారని అన్నారు.గ్రామసభ, పంచాయితీ బాడీ మీటింగ్ లో చేసిన తీర్మానాలకు విరుద్ధంగా పనిచేసి అవక తవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.నాలుగు ప్లాట్లు కబ్జాలో ఉన్న వారికి ఇల్లు కట్టకపోయినా ఇంటి నెంబర్లు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంటి నెంబర్ ఇచ్చేందుకు 20 నుండి 50 వేలు తీసుకుంటూ ఇండ్లు కట్టకున్నా ఆన్లైన్ చేసి నెంబర్లు కేటాయిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు.ఇల్లు కట్టుకునే ఓ వ్యక్తి పక్క స్థలంలో సిమెంట్ సంచులు తదితర సామాన్లు పెట్టుకునేందుకు కట్టుకున్న రేకుల షెడ్డు స్థలాన్ని సైతం ఆ ఇల్లు కట్టిన వ్యక్తి పేరుపై చేసి ఇంటి నెంబర్ ఇచ్చేసిన ఘనత సెక్రెటరీదని మండిపడ్డారు. సెక్రెటరీ పై గత మార్చిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడు లేదని గ్రామస్తులు వాపోయారు. సెక్రెటరీని ట్రాన్స్ఫర్ చేసేందుకు సోమవారం ఉత్తర్వులు వచ్చాయని తెలుసుకున్న ఆయన మంగళవారం ఉదయం 8 గంటలకి గ్రామపంచాయతీకి వచ్చి ఆయనకు అనుకూలంగా ఉన్న కొందరు వ్యక్తులకు ఇంటి నెంబర్లు కేటాయించి రిసిప్ట్ లు చింపారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ.52,000 రిసిప్ట్ లు చింపిన సెక్రటరీ వద్ద కేవలం 32వేల రూపాయలు మాత్రమే ఎందుకు ఉన్నాయని డబ్బులు ఇవ్వకుండా రిసిప్ట్ లు ఇవ్వడం ఏంటని ప్రజలు ప్రశ్నించారు. డబ్బులు ఇచ్చిన వారి పనులను మాత్రమే చేస్తున్నాడని పేద ప్రజల పనులను మాత్రం అస్సలు చేయడం లేదని ప్రజలు చెప్పారు.సెక్రెటరీ పై పూర్తి విచారణ జరిపి ఆయనను విధుల నుండి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సెక్రటరీని వివరణ కోరగా ఎంపీడీవో చెబితేనే ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చానని చెప్పటం విశేషం. ఈ విషయంపై గ్రామపంచాయతీలో తీర్మానం చేశామని చెప్పడం కొసమెరుపు. కాగా సెక్రటరీని నిర్బంధించిన విషయం తెలుసుకున్న డిఎల్పిఓ నాగరాజు ఓ అధికారిని అక్కడికి పంపి ప్రజలు ఆరోపిస్తున్న ఆరోపణల దృష్ట్యా సంబంధిత రికార్డులను సీజ్ చేయాలని చెప్పడంతో రికార్డులను అధికారులు సీజ్ చేశారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపిన అనంతరం సెక్రెటరీపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసి ఇంటి నెంబర్లు కేటాయిస్తే వాటిని రద్దు చేయడం జరుగుతుందని అన్నారు. నాలుగైదు ప్లాట్లు కబ్జా చేసుకున్న వారి నుండి ప్లాట్లను స్వాధీనం చేసుకుంటామని అర్హులందరికీ ఎంక్వయిరీ చేసి ఇంటి నెంబర్లు కేటాయిస్తామని చెప్పడంతో శాంతించిన గ్రామ ప్రజలు సెక్రటరీని వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్,సర్పంచ్ ఉదయ్ భాస్కర్,ఉపసర్పంచ్ గోపి,వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు ఉన్నారు.

# జనగణన.. భూ రీసర్వే.. బతుకమ్మ వేడుకలపై ప్రత్యేక దృష్టి

- సమగ్ర వివరాల నమోదుకు అధికారులకు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశాలు
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచన

**వనపర్తి,అక్టోబరు 13 (ప్రజాక్షేత్రం):**

జనగణన-2027ను పక్కాగా నిర్వహించడం, రైతుల భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయడం, బతుకమ్మ వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించడంతోపాటు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.
ఆయా కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం సూచించారు.

**జనగణనలో ఏ ఒక్క ఇల్లు తప్పొద్దు**

జనగణన-2027 రెండో దశలో భాగంగా ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ జనాభా గణనలో ప్రతి ఒక్కరి వివరాలను సమగ్రంగా, కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే గృహ జాబితా తయారీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి చేపట్టే జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.
శిక్షణలో వివరించే విధివిధానాలను పూర్తిగా అవగాహన చేసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. జనాభా గణన చేపట్టే గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ అందించాలని, ప్రతి ఇంటి నుంచి సరైన వివరాలు సేకరించేలా చూడాలని ఆదేశించారు. ఏ ఒక్క భవనం కూడా గణన పరిధి నుంచి తప్పిపోకుండా పర్యవేక్షించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జనగణనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**భూ రీసర్వేను గడువులోగా పూర్తి చేయాలి**

రైతులకు ప్రస్తుతం ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంతోపాటు భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి మండలం వీరాయిపల్లి, ఘనపురం మండలం మల్కాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు.
వీరాయిపల్లి గ్రామ విస్తీర్ణ సర్వే పూర్తయిందని, మల్కాపూర్‌లో సర్వేను మరో వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. తదుపరి రోజు నుంచి పట్టా భూముల్లో అనుభవదారు సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులతో మాట్లాడిన ఆయన రీసర్వే ద్వారా ప్రస్తుత భూ సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు ఉన్నారు.

**ఘనంగా బతుకమ్మ.. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి**

జిల్లాలో బతుకమ్మ వేడుకలను సంప్రదాయ బద్ధంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, పర్యాటక శాఖ ఎండీ వల్లూరు క్రాంతి జిల్లా అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, బతుకమ్మ వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు.
అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు శాఖల వారీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అక్టోబరు 14న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, 15న మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, 16న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటి అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.
పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమాల్లో సీపీఓ హరికృష్ణ, జనగణన శిక్షణ అధికారులు సుల్తాన్, హరిత, జడ్పీ సీఈఓ యాదయ్య, డీపీఆర్వో సీతారాం,డీవైఎస్వో సుధీర్‌రెడ్డి,డీడబ్ల్యూవో సుధారాణి,ఇతర అధికారులు పాల్గొన్నారు.






# అన్నపూర్ణా దేవి గా జగన్మాత దర్శనం

- ఆకలి దప్పులు తీర్చే సాక్షాత్ అన్నపూర్ణ.. సర్వ శుభప్రదాయిని
- ధైర్యానికి, శాంతికి ప్రతీక శ్రీ చంద్రఘంటా దుర్గ
- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో సాగుతున్న నవరాత్రి వేడుకలు

**నందవరం,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం):**



దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. జగన్మాతను తెలుగు సంప్రదాయం (శ్రీవిద్య) ప్రకారం సర్వజీవుల ఆకలి తీర్చే సాక్షాత్ శ్రీ అన్నపూర్ణా దేవిగా, పురాణోక్త నవదుర్గా సంప్రదాయం ప్రకారం వీరత్వానికి, శాంతికి ప్రతిరూపమైన శ్రీ చంద్రఘంటా దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు.

**అన్నపూర్ణా దేవి విశిష్టత:**

"నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ.." అంటూ స్తుతించే అన్నపూర్ణా దేవి సమస్త జీవకోటికి ఆహారాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించే అమృతమూర్తి. పరమశివుడికే భిక్షాటన చేసి ఆకలి తీర్చిన పరమదయామయి. ఒక చేతిలో బంగారు గరిటె, మరో చేతిలో రత్నఖచిత పాత్రను ధరించి దర్శనమిచ్చే అన్నపూర్ణమ్మను దర్శించుకుంటే జీవితంలో ఎన్నడూ అన్నవస్త్రాలకు లోటు ఉండదని, దారిద్ర్యం తొలగి సుఖ సంతోషాలు చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ రోజున భక్తులు అమ్మవారికి రవ్వకేసరి, పరమాన్నం, పొంగలి వంటి విశేష నైవేద్యాలను సమర్పిస్తారు.

**చంద్రఘంటా దేవి రూపం – ప్రాశస్త్యం:**

నవదుర్గలలో మూడో రూపమైన చంద్రఘంటా దేవి నుదుటిపై అర్ధచంద్రుడు ఘంట (గంట) ఆకారంలో ప్రకాశిస్తూ ఉంటాడు. సింహవాహనాన్ని అధిరోహించి, పది చేతులలో వివిధ ఆయుధాలను ధరించి దర్శనమిస్తుంది. చంద్రఘంటా దేవిని ఆరాధించడం వల్ల భక్తులకు శత్రుభయం తొలగి, మనోధైర్యం, ధైర్యసాహసాలు, అంతర్గత శాంతి లభిస్తాయి. సాధకులకు మణిపూరక చక్ర జాగృతి కలుగుతుందని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు.

**ఆలయాలలో భక్తుల రద్దీ:**

మూడో రోజు సందర్భంగా మండలంలోని శ్రీ మాతా బంగారమ్మ దేవి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలలోని దేవీ క్షేత్రాలలో తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివస్తున్నారు. ఆలయ కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక దర్శన క్యూలైన్లు, తీర్థప్రసాదాల ఏర్పాట్లు చేశాయి.

# 40 ఏళ్లుగా పట్టా హక్కుల కోసం ఎదురుచూపులు

- కేటాయించిన భూములకు పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వాలి

**మహేశ్వరం,అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం)**

:మండల పరిధిలోని నల్లవెల్లి, మొండిగౌరెల్లి, ధర్మన్నగూడ, నజిక్‌సింగారం గ్రామాల్లో సుమారు 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం భూములు కేటాయించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతులకు ఇప్పటివరకు పట్టా హక్కులు కల్పించలేదని, తక్షణమే పట్టాలు మంజూరు చేసి పాస్ పుస్తకాలు అందించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గండు నరసింహ డిమాండ్ చేశారు.
ఈ మేరకు సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ బోడ ముత్యాలు ఆధ్వర్యంలో యాచారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గండు నరసింహ మాట్లాడుతూ, భూములు కేటాయించిన రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కన్వీనర్ బోడ కృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ జోగు రమేష్, యాచారం మండల కోఆర్డినేటర్ బడే భాగ్యమ్మతో పాటు రైతులు కంబాలపల్లి జంగయ్య,బోర్గయ్య, యాదయ్య,ఎట్టి జంగయ్య, గోరటి చంద్రయ్య,యాదమ్మ, నరసమ్మ,కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.







# వనపర్తిలో గ్యాస్ సిలిండర్ పేలుడు.. ముగ్గురికి తీవ్ర గాయాలు!

- వెంకటాచారి ఇంట్లో చెలరేగిన మంటలు..
- ఇద్దరికి హైదరాబాద్‌లో చికిత్స
- బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి
- వాకిటి శ్రీధర్ డిమాండ్

**వనపర్తి,అక్టోబరు 13 (ప్రజాక్షేత్రం):**



వనపర్తి పట్టణంలోని 30వ వార్డులో భారత్ గ్యాస్ సిలిండర్ పేలుడు తీవ్ర కలకలం రేపింది. స్థానికంగా వెంకటాచారి నివాసంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. మంటలు వ్యాపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన ముగ్గురిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ప్రమాదంలో ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి ధ్వంసమై ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.
ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, గ్యాస్ సిలిండర్ భద్రతకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వాకిటి శ్రీధర్**

ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా బిఅర్ ఎస్ అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ప్రమాదంలో జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితులకు తగిన న్యాయం చేయాలని సంబంధిత సంస్థను డిమాండ్ చేశారు.

**భారత్ గ్యాస్ సంస్థ నష్టపరిహారం చెల్లించాలి**

సిలిండర్ పేలుడు ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని వాకిటి శ్రీధర్ కోరారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామగ్రి ధ్వంసం కావడంతో నష్టపోయిన వెంకటాచారి కుటుంబానికి భారత్ గ్యాస్ సంస్థ తగిన నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే భారత్ గ్యాస్ సంస్థ ఎదుట తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా మేఘారెడ్డి నియామకం

**వనపర్తి,అక్టోబరు 13 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కాంగ్రెస్ పార్టీ మరో కీలక బాధ్యత అప్పగించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆయనను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.
వనపర్తి శ్రీవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు మరోవైపు, ఆశ్వయుజ శుక్లపక్ష తదియ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఆయన సతీమణి శారదారెడ్డి మంగళవారం వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు మంగళవాయిద్యాల నడుమ దంపతులకు వేద ఆశీర్వచనాలు అందించారు.
ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సకల శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే దంపతులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి, ఎస్ఎల్ఎన్ రమేష్, 1కౌన్సిలర్లు పితాంబరం,రవి యాదవ్, శాంతికుమార్‌గౌడ్,పరశురాం, చక్కరాజు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,పట్టణ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.







# దుర్గాదేవి మండపంలో మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్త ప్రత్యేక పూజలు

**జవహర్ నగర్, సెప్టెంబర్ 13, (ప్రజాక్షేత్రం):**

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం జవహర్ నగర్ లోని సంతోష్ నగర్ కాలనీ దుర్గామాత మండపంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన చేసి, ఆ తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.అనంతరం రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రమణప్ప. నరసింహ గౌడ్,సుధాకర్. విజయ్,మనోజ్,అనిరుద్, శ్రీమన్నారాయణ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న బిగ్ బాస్ యాంకర్స్...

- **తూప్రాన్ మహంకాళి దేవాలయంలో ప్రముఖ నటీమణుల ప్రత్యేక పూజలు..**

**తూప్రాన్ అక్టోబర్ 13 ( ప్రజాక్షేత్రం )ప్రతినిధి**

నవదుర్గ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూప్రాన్ మహంకాళి దేవాలయంలో నిర్వహించే దేవి నవరాత్రుల్లో అమ్మవారిని ప్రముఖ నటీమణులు బిగ్ బాస్ ఫేమ్ ఆశు రెడ్డి, ప్రవీణాలు, వారి కుటుంబ సభ్యులు రాకేష్ రెడ్డి అనిల్ దంపతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయం వద్ద సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కుడిపాక నారాయణ గుప్తా ఆధ్వర్యంలో ప్రముఖ నటిమణులు దేవాలయానికి విచ్చేసి అమ్మవారికి కుంభహారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు బిగ్బాస్ బిగ్ బాస్ ఫేమ్ నటీమణులు ఒక్కసారిగా దేవాలయంలో ప్రత్యక్షమవడంతో అభిమానులు సెల్ఫీ తీసుకొని సందడి చేశారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోటేశ్వరరావు తాటి విట్టల్ శంకరంపేట్ నాగరాజు గౌడ్ సూర్య ప్రకాష్ గౌడ్ గడ్డం శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి వేణుగోపాల్ తాటి విట్టల్ పోతరాజు నాగరాజు మధు చందు తదితరులు పాల్గొన్నారు



# బ్రెయిన్ స్ట్రోక్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

- **యశోద హాస్పిటల్స్ న్యూరో వైద్య నిపుణుడు డాక్టర్ శివరామ్ రావు**

**మెదక్, అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం)**

బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు ను తగ్గించుకోవాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం తో పాటు రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ ను నియంత్రణ లో ఉంచుకోవాలని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ న్యూరో వైద్య నిపుణుడు డాక్టర్ శివరామ్ రావు సూచించారు. మంగళవారం మెదక్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ఆరోగ్యకరమైన బరువు స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలో కీలకమన్నారు. పొగతాగడం, పొగాకు వినియోగం, అధిక మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు ఆహారంలో భాగంగా చేసుకోవాలని, ఉప్పు, అధిక కొవ్వు పదార్థాలు, స్వీట్లు, ఫాస్ట్ఫుడ్ వినియోగాన్ని పరిమితం చేయాలని తెలిపారు. బీపీ, షుగర్ సమస్యలు ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడాలని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు.

**బి12 లోపంతోనూ నరాల సమస్యలు**

చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, మంటలు, స్పర్శ తగ్గడం, కండరాల బలహీనత, నడకలో ఇబ్బందులు విటమిన్ బి12 లోపం వల్ల కూడా రావచ్చని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచన లేకుండా సొంతంగా మందులు వాడకూడదని సూచించారు.

**స్ట్రోక్ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి**

ముఖం ఒకవైపు వాలిపోవడం, చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం, మాట తడబడటం, మాట్లాడలేకపోవడం, చూపులో ఆకస్మిక మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలని డాక్టర్ శివరామ్ రావు సూచించారు. లక్షణాలు కొద్ది సేపటికి తగ్గిపోయినా నిర్లక్ష్యం చేయకూడదని, స్ట్రోక్ చికిత్సలో ప్రతి నిమిషం కీలకమని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్లో బైప్లేన్ న్యూరో క్యాథ్ ల్యాబ్ వంటి ఆధునిక సదుపాయాలతో మెదడు రక్తనాళాల సమస్యలకు నిర్ధారణ, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.




# చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసంపై నిరసన..

- **దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి..రజక సంఘం డిమాండ్**

**చిన్న శంకరంపేట ( ప్రజాక్షేత్రం ) అక్టోబర్ 13**



మెదక్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గత రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం చిన్న శంకరంపేట మండలం అంబాజీపేటలో రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ చేగుంట-మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని అన్నారు. సమాజం గర్వించదగిన పోరాట యోధురాలి విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా విరమింపజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంబాజీపేట రజక సంఘం నాయకులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల జీవనభృతి కోసం భారీ ర్యాలీ, ధర్నా..

- **ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4,016 జీవనభృతి వెంటనే అమలు చేయాలి..**
- **హామీని నిలబెట్టుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు.. యూనియన్ నాయకులు**

**నార్సింగి ( ప్రజాక్షేత్రం ) అక్టోబర్ 13**




ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ నెలకు రూ.4,016 జీవనభృతిని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీడీ కార్మికులు భారీ ర్యాలీగా వెళ్లి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం బీడీ కార్మికుల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను తహసీల్దార్ గ్రేస్‌బాయికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు పిట్ల రామకృష్ణ మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బీడీ కార్మికులకు విధించిన కటాఫ్ తేదీని తొలగించి, అర్హులైన కార్మికులందరికీ జీవనభృతి అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.2,016 జీవనభృతి పొందుతున్న వారికి మరో రూ.2,000 పెంచి నెలకు రూ.4,016 అందిస్తామని ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్ల బీడీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కటాఫ్ తేదీ పేరుతో కార్మికులకు అన్యాయం చేయకుండా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి బీడీ కార్మికుడికి నెలకు రూ.4,016 జీవనభృతిని అందించాలని కోరారు. లేనిపక్షంలో గతంలో కేసీఆర్‌కు ఎదురైన రాజకీయ పరిస్థితులే రేవంత్‌రెడ్డికి ఎదురవుతాయని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్. రమేష్, సత్తమ్మ మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు, వివక్ష లేకుండా జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా బీడీలు చుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులకు ప్రభుత్వ సాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా జాప్యం చేయడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవనభృతిని అమలు చేయాలని, లేకుంటే బీడీ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని, జీవనభృతిని వెంటనే అందించి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) కామారెడ్డి జిల్లా నాయకులు ప్రకాష్, కామారెడ్డి-నిజామాబాద్ రూరల్ ఉమ్మడి జిల్లాల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్. కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం కామారెడ్డి-నిజామాబాద్ రూరల్ జిల్లాల నాయకులు బి. కిషోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.





# ఇమాంపూర్ గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన చంద్రశేఖర్ రెడ్డి తహసీల్దార్

**తూప్రాన్ అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం )**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఇమాంపూర్ గ్రామంలో మంగళవారం రోజు జరుగుతున్న భూముల రీసర్వే పనులను తహసీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు.

అనంతరం గ్రామ రైతులతో మాట్లాడి, రీసర్వే ద్వారా భూముల సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డులలో ఖచ్చితత్వం పెంపొందించడం, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను నివారించడం వంటి ప్రయోజనాలను వివరించారు. రైతులు రీసర్వే ప్రక్రియపై అవగాహన కలిగి ఉండి, సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని తహసీల్దార్ సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ సిబ్బంది, సర్వే సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ప్రజాసేవ, వృత్తిపరమైన నిబద్ధతపై పోలీసులకు వ్యాసరచన పోటీలు

- **పోటీలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**మెదక్ అక్టోబర్ 13 (ప్రజాక్షేత్రం)**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రజా సేవ పట్ల బాధ్యత, వృత్తిపరమైన నిబద్ధత, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కల్పించడమే పోటీల ఉద్దేశమని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సిబ్బందికి రెండు అంశాలపై పోటీలు నిర్వహించగా, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా సేవలందించడం తో పాటు సోషల్ మీడియాను సమాజ ప్రయోజనాలకు వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు.





# రికార్డుల గిల్.. పరుగుల రాణి షెఫాలీ.. ఐసీసీ అవార్డులు వీరికే!

- **గిల్‌కు ఐదోసారి పురుషుల ప్లేయర్ ఆఫ్ ద మంత్ పురస్కారం**
- **షెఫాలీకి రెండోసారి మహిళల విభాగంలో అవార్డు**
- **వెస్టిండీస్‌పై గిల్ 110, 223 పరుగులతో సత్తా**
- **షెఫాలీ ఆసియా కప్‌లో 360 పరుగులు, ఆరు వికెట్లు**
- **ఆసియా క్రీడల సెమీఫైనల్లో షెఫాలీ అజేయ శతకం**

ప్రజాక్షేత్రం :

భారత ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, షెఫాలీ వర్మ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెలుచుకున్నారు. సెప్టెంబర్ 2026కు గానూ ప్రకటించిన పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి అందుకున్నాడు. మహిళల విభాగంలో షెఫాలీ రెండోసారి ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఆసియా కప్, ఆసియా క్రీడల్లో షెఫాలీ రాణించగా.. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అదరగొట్టాడు.

**గిల్ రికార్డు.. ఐదోసారి అవార్డు**

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అద్భుత ప్రదర్శన చేశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాతి మ్యాచ్‌లో 133 బంతుల్లో 223 పరుగులతో చెలరేగాడు. లక్ష్య ఛేదనలో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో 39 బంతులు మిగిలుండగానే ఛేదించింది. గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, జులై నెలల్లో గిల్ ఈ అవార్డు అందుకున్నాడు. తాజా పురస్కారంతో ఐదుసార్లు ఈ ఘనత సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఐదుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు.

**షెఫాలీకి రెండోసారి..**

మహిళల విభాగంలో షెఫాలీ వర్మ తన బ్యాటింగ్ జోరుతో ఆకట్టుకుంది. ఆసియా కప్‌లో భారత్ విజయంలో కీలకంగా నిలిచింది. ఆ టోర్నీలో 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. 184.61 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసింది. ఆసియా క్రీడల్లోనూ షెఫాలీ సత్తా చాటింది. బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అజేయంగా 100 పరుగులు చేసింది. శ్రీలంకతో ఫైనల్లో 48 పరుగులు సాధించింది. గతేడాది నవంబరులో మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆడినందుకు తొలిసారి ఈ అవార్డు అందుకుంది.

**భారత ఆటగాళ్లకు మూడోసారి డబుల్ ధమాకా**

ఒకే దేశానికి చెందిన ఆటగాళ్లు పురుషుల, మహిళల విభాగాల్లో ఒకేసారి అవార్డులు గెలవడం ఇది ఐదోసారి. భారత ఆటగాళ్లు ఇలా రెండు పురస్కారాలు అందుకోవడం ఇది మూడోసారి. 2024 జూన్‌లో జస్ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన.. 2025 సెప్టెంబర్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఈ ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన అభిమానుల ఓట్లు, మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లు, మీడియా ప్రతినిధులతో కూడిన నిపుణుల కమిటీ నిర్ణయం ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు.



# జైలు నుంచి వచ్చాక శతకం.. మైదానంలోనే ఏడ్చేసిన బెంగాల్ క్రికెటర్!

- **రంజీ ట్రోఫీలో సెంచరీ చేసిన బెంగాల్ వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్**
- **శతకం పూర్తి కాగానే మైదానంలో భావోద్వేగంతో కన్నీళ్లు**
- **తీవ్రమైన ఆరోపణలతో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై విడుదల**
- **మాటలతో కాకుండా ఆటతోనే సమాధానం చెబుతానని వెల్లడి**
- **ఢిల్లీతో మ్యాచ్‌లో బెంగాల్‌కు కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**

ప్రజాక్షేత్రం :

తీవ్రమైన ఆరోపణలతో జైలుకు వెళ్లి, ఇటీవలే బెయిల్‌పై విడుదలైన బెంగాల్ వికెట్ కీపర్‌బ్యాటర్ అభిషేక్ పోరెల్.. తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగుపెట్టి అద్భుత శతకంతో కదం తొక్కాడు. రంజీ ట్రోఫీలో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలన్న తన పట్టుదలను ఈ సెంచరీతో చాటుకున్నాడు. కల్యాణి వేదికగా జరుగుతున్న ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగాల్ తరపున ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో సుదీప్ ఘరామి (122 నాటౌట్) కూడా శతకంతో రాణించడంతో వీరిద్దరి భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరు అందించింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని 240 పరుగులకు ఆలౌట్ చేసిన బెంగాల్, రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసి కీలక ఆధిక్యం సంపాదించింది.

తన కెరీర్‌లో ఇది రెండో ఫస్ట్‌క్లాస్ సెంచరీ. ఈ మైలురాయిని అందుకున్న వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీటిపర్యంతమయ్యాడు. ఆ తర్వాత తేరుకుని, బ్యాట్ పైకెత్తి అభివాదం చేశాడు. ఈ ఘటన మైదానంలో ఉన్నవారిని కదిలించింది. ఆట అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. ఆ భావోద్వేగం తనకు తెలియకుండానే వచ్చేసిందని చెప్పాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నానని, ఈ సంబరం అందులో భాగమేనని వివరించాడు. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లాకు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. గత కొన్ని వారాలుగా పోరెల్ వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కర్ణాటకకు చెందిన ఓ మెడికల్ విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేసి అత్యాచారం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ ఫిర్యాదు మేరకు ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నెల రోజులకు పైగా జైలులో ఉన్న పోరెల్, సెప్టెంబర్‌లో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందాడు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను అతను ఖండించాడు. ఈ నేపథ్యంలోనే అతడిని రంజీ ట్రోఫీ ఆరంభ మ్యాచ్‌కు బెంగాల్ జట్టులోకి ఎంపిక చేశారు. ఈ విషయంపై స్పందించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (సీఏబీ), అతని వ్యక్తిగత, న్యాయపరమైన విషయాలతో తమకు సంబంధం లేదని, ప్రస్తుతం జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేసింది.



# హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు.. 12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు!

- **2027 క్రికెట్ ప్రపంచకప్ టికెట్లకు భారీ డిమాండ్**
- **12 రోజుల్లోనే కోటిన్నరకు పైగా దరఖాస్తులు**
- **దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యం**
- **24 ఏళ్ల తర్వాత ఆఫ్రికాలో జరగనున్న మెగా టోర్నీ**
- **చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించేందుకు ఐసీసీ సన్నాహాలు**

ప్రజాక్షేత్రం :




2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటాయి. టోర్నీ ఆరంభానికి ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టికెట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు రావడం క్రికెట్ అభిమానుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 142 దేశాల నుంచి అభిమానులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు రాగా, 44,23,417 బ్యాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన మొదటి వారంలోనే 10 లక్షల దరఖాస్తులు రాగా, ఆ తర్వాత అనూహ్యంగా ఈ సంఖ్య పెరిగింది.

దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీ ఆఫ్రికా గడ్డపై జరగనుండటం విశేషం. అంతేకాకుండా, నూతన ఫార్మాట్‌లో జరగనున్న ఈ 14వ ఎడిషన్‌ను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ అనూహ్య స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా మాట్లాడారు. "ప్రపంచ కప్ టోర్నీకి ఉన్న ప్రతిష్ఠ, ఆతిథ్య దేశాలుగా ఆఫ్రికా దేశాలకు ఉన్న ఆకర్షణ, టోర్నీకి ముందు ఐసీసీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలే ఈ భారీ స్పందనకు కారణం. ఇది మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని వివరించారు.

టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉన్నందున, రానున్న రోజుల్లో 360 డిగ్రీల యాక్టివేషన్లు, వివిధ వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతామని ఆయన తెలిపారు.

అభిమానులు టికెట్ల బ్యాలెట్ కోసం రిజిస్టర్ చేసుకునేందుకు 2026 నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 2027 నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ 2027 అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో మూడు జట్ల సూపర్ సిరీస్‌తో ప్రారంభం కానుంది.

మొత్తం మీద టోర్నీ ఆరంభానికి ముందే టికెట్లకు ఈ స్థాయిలో డిమాండ్ రావడం, ఈ మెగా ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది.

# ఇటీవలే టీమిండియాలోకి ఎంట్రీ.. అప్పుడే కొత్త కారు కొన్న యువ పేసర్!

- **ఇటీవలే టీమిండియాలోకి వచ్చిన పేసర్ అకిబ్ నబీ**
- **కార్ల షోరూమ్‌లో కనిపించడంతో వైరల్ అయిన వీడియో**
- **కొత్త కారు కొన్నారంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు**
- **సెప్టెంబర్ 30న వెస్టిండీస్‌పై వన్డేల్లోకి అరంగేట్రం**
- **గత రంజీ సీజన్ లో 60 వికెట్లతో జమ్మూ కశ్మీర్‌ను గెలిపించిన బౌలర్**

ప్రజాక్షేత్రం :



జమ్మూ కశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకిబ్ నబీ ఇటీవలే భారత జట్టులోకి అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అతడు ఓ కార్ల షోరూమ్‌లో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హ్యుందాయ్ మోడల్ కారులో అకిబ్ కూర్చుని ఉన్న వీడియో ఒకటి బయటకు రావడంతో అకిబ్ కొత్త వాహనం కొనుగోలు చేశారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.

సెప్టెంబర్ 30న గువాహటిలోని బర్సపరా స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అకిబ్ నబీ టీమిండియా తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. కేఎల్ రాహుల్ చేతుల మీదుగా ఇండియా క్యాప్ అందుకున్నాడు. పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ తర్వాత భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మూడో జమ్మూ కశ్మీర్ క్రికెటర్‌గా నిలిచాడు. తన తొలి మ్యాచ్‌లో 8.4 ఓవర్లు బౌలింగ్ చేసి 84 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఈ సిరీస్‌ను భారత్ 21 తేడాతో గెలుచుకుంది. అయితే, 202526 రంజీ ట్రోఫీ సీజన్‌లో అకిబ్ అద్భుతంగా రాణించాడు. మొత్తం 60 వికెట్లు పడగొట్టి, జమ్మూ కశ్మీర్ జట్టు తొలిసారి రంజీ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతోనే అతడు జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అంతకుముందు ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌కు ఎంపికైనా, తుది జట్టులో ఆడే అవకాశం రాలేదు. ప్రస్తుతం రాబోయే రంజీ ట్రోఫీ సన్నాహక శిబిరానికి ఎంపికైన అకిబ్, త్వరలో ఇండియాఏ తరఫున కూడా ఆడనున్నాడు.

# ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్.. బీసీసీఐ రెండు కండిషన్లు

- **ఆటగాళ్ల ఎంపికలో వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ముఖ్యమన్న బీసీసీఐ అధ్యక్షుడు**
- **తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని స్పష్టీకరణ**
- **గిల్‌కు సీనియర్ల అనుభవం ఉపయోగపడుతుందన్న మన్హాస్**
- **బౌలింగ్ బాధ్యతల్లో బుమ్రా కీలకంగా మారగలడని వ్యాఖ్య**
- **ప్రపంచకప్ విజయానికి బౌలింగ్, ఫీల్డింగ్ కీలకమని కైఫ్ స్పష్టీకరణ**

ప్రజాక్షేత్రం :



2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే.

**ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం**

ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు.

**గిల్‌కు సీనియర్ల అండ**

వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు.

**బౌలింగ్, ఫీల్డింగే కీలకం: కైఫ్**

మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# మా డ్రెస్సులు మాయం చేయడంతో పాటు సైజులు మారుస్తున్నారు..

గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మోర్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.
ఆన్‌లైన్‌లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నవ్వొస్తుందని సరదాగా అన్నారు.
మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు. ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.



‘ఉప్పెన’ సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన ‘జీనీ’ అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్.
ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యానర్‌పై అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్‌లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు మాత్రం తెలుగు, తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్‌లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



## బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న బేబమ్మ..



## ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించింది

పలు చిత్రాల్లో నటించి ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ అనన్య పాండే తాజాగా మరో అరుదైన బాధ్యతను అందుకున్నారు. ఇటీవల ‘చాంద్ మేరా దిల్’ చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, రాబోయే ప్రతిష్టాత్మక IIFA అవార్డ్స్ 2027 వేడుకకు సహ-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. నటిగా తనదైన అందం, అభినయంతో అభిమానులకు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు తొలిసారి యాంకర్‌గా అవార్డుల వేదికను హోస్ట్ చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా IIFAతో తనకున్నఅనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనన్య ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకెప్పుడూ ఎంతో ప్రత్యేకమని అనన్య అన్నారు. అబుదాబిలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వేదికపైనే తాను మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని, ఆ క్షణంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఐఫా అవార్డ్స్‌ను టీవీల్లో చూస్తూ పెరిగిన తనకు, భారతీయ సినిమాకు సంబంధించిన ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించిందని తెలిపారు.

కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటి ప్రతి వేడుక ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, కెరీర్‌లో మరింతగా ఎదగడానికి, తనలోని సరికొత్త నైపుణ్యాలను బయటపెట్టుకోవడానికి మంచి అవకాశాలు దక్కాయని అనన్య వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునే అవకాశం ఐఫా ద్వారానే కలిగిందని తెలిపారు. ఐఫా వేదికపై ఉండే జోష్, అక్కడి వాతావరణం, ప్రేక్షకుల అరుపులు, అలాగే మన సినిమా ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులంతా ఒకేచోట చేరి చేసే సందడిలో నిజంగానే ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఐఫా అవార్డ్స్‌కు సహ-హోస్ట్‌గా ఒక సరికొత్త బాధ్యతతో ఐఫా 2027 వేదికపైకి వస్తుండటం తనకెంతో సంతోషాన్నిస్తోందని అనన్య అన్నారు. మళ్లీ అదే వేదికపైకి వెళ్లి, మన దేశంలోని గొప్ప నటులు, అద్భుతమైన కథలు, విజయాలను అందరితో కలిసి వేడుకలా సెలబ్రేట్ చేసుకునే అవకాశం రావడం తనలో ఉత్సాహాన్ని నింపుతోందని చెప్పారు.

# ఆసక్తికరమైన కబుర్లు రాబోతున్నాయ్!

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కలయికలో ఓ సినిమా ఖరారైన విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఒక ప్రత్యేకమైన ప్రచార చిత్రంతో ఈ సినిమాని ఇదివరకే అధికారికంగా ప్రకటించాయి సినీ వర్గాలు. అయితే గత కొన్ని రోజులుగా ఈ సినిమా ఆగిపోయిందని, ఆలస్యం అవుతుందనీ... ఇలా రకరకాలుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ఈ చర్చలన్నిటికీ ఫుల్‌స్టాప్ పెడుతూ లోకేశ్ కనగరాజ్ సోమవారం ఎక్స్ వేదికగా... అల్లు అర్జున్‌తో చర్చలు జరుపుతున్న ఫొటోతోపాటుగా, త్వరలోనే ఈ సినిమాకి సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్‌లు రాబోతున్నాయంటూ పోస్ట్‌ని పంచుకున్నారు. దసరా సందర్భంగా కానీ, దీపావళి సందర్భంగా కానీ ఈ చిత్రం ఎప్పుడు మొదలవుతుందో స్పష్టమయ్యే అవకాశాలున్నాయని సమాచారం.



## రక్త దాహం పెరుగుతోంది..
# హైందవ టీజర్ రాబోతున్నది

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ ‘హైందవ’. దర్శకుడు లుధీర్ బైరెడ్డి తెరకెక్కిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌కు ముహూర్తం ఫిక్స్ చేస్తూ.. ‘కోపానికి ఒక కొత్త రూపం వచ్చింది. రక్త దాహం పెరుగుతోంది.. శక్తివంతమైన హైందవ టీజర్ అక్టోబర్ 14న రానుంది’ అంటూ ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. కాగా.. 400 ఏళ్లనాటి ఆలయం నేపథ్యంలో సాగే ఈ పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌కు లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.




# ప్రభాస్ ‘ది రాజాసాబ్’ ఫ్లాప్.. అలా చేయకుండా ఉండాల్సిందన్న నిర్మాత

సంక్రాంతికి కాకుండా మరే సీజన్‌లో వచ్చినా ‘ది రాజాసాబ్’ బాగా ఆడేదని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఓటీటీలో విడుదలైన తర్వాత మరిన్ని విమర్శలు ఎదుర్కొంది. ఈ క్రమంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న తాజా చిత్రం ‘గరివిడి లక్ష్మి’. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమోషన్స్‌లో ‘ది రాజాసాబ్’ ఫలితంపై టీజీ విశ్వ ప్రసాద్ స్పందించారు.
‘‘ది రాజాసాబ్’ను సరైన సీజన్‌లో విడుదల చేయలేదేమో. ఒకవేళ సంక్రాంతికి కాకుండా ఎప్పుడు వచ్చినా బాగా ఆడేది. సినిమాకున్న భారీదనాన్ని దృష్టిలో పెట్టుకుని మా వరకూ బాగానే విడుదల చేశాం. టికెట్ రేట్లు పెంచేందుకు ప్రయత్నించాం. దీంతో సినిమా ప్రీమియర్ ఆలస్యమైంది. అలా చేయకుండా ఉండాల్సింది. చాలా మంది అసహనానికి గురయ్యారు. ఇంకా చాలా కారణాలు ఉన్నాయి. మా సంస్థ నుంచి చాలా సినిమాలకు సీక్వెల్స్ వస్తాయి. అయితే, ఏది చేసినా చాలా జాగ్రత్తగా చేయాలని నిర్ణయించుకున్నాం’’
‘‘ప్రతి సినిమా ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని చేస్తాం. వాటిల్లో ‘గరివిడి లక్ష్మి’లాంటి వైవిధ్య చిత్రం ఉంటుంది. అలాగే ‘మిరాయ్’, ‘జాంబీరెడ్డి’ వంటి కొనసాగింపు చిత్రాలూ ఉంటాయి. ‘స్పిరిట్’ మూవీ విషయంలో నా పాత్ర చాలా తక్కువ. నేను కేవలం డిస్ట్రిబ్యూటర్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నా. 2028లో ప్రభాస్‌తో ఓ మూవీ ఉంటుంది. అది కూడా భారీ స్థాయిలో తీస్తాం. కొన్ని సినిమాల విషయంలో తప్పులు జరిగాయి. ప్రస్తుతం పది సినిమాల వరకూ మా ప్రొడక్షన్ హౌస్‌లో షూటింగ్ జరుపుకొంటున్నాయి. భవిష్యత్‌లో తప్పులు జరగకుండా చూసుకుంటాం’’ అని టీజీ విశ్వప్రసాద్ అన్నారు. దసరా సందర్భంగా ‘జైలర్2’, ‘రణబాలి’ వంటి భారీ చిత్రాలు విడుదలవుతున్నా, తామొక మంచి సినిమాతో వస్తున్నామని, ‘గరివిడి లక్ష్మి’ ఎక్కువ రోజులు థియేటర్‌లో ఆడుతుందని ధీమా వ్యక్తం చేశారు.





# మనసుకు హత్తుకునే ప్రేమకథ.. నేచురల్ స్టార్‌తో జోడీ కట్టనున్న రుక్మిణి వసంత్!



టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయారు కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. ఇండస్ట్రీకి వచ్చిన తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో వరుస బ్లాక్ బస్టర్లు అందుకుంటూ దూసుకెళ్తున్న ఈ అమ్మడుకి ఇప్పుడు తెలుగులో మరో బంపర్ ఆఫర్ వచ్చినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. ‘96’, ‘మెయ్యళగన్’ వంటి అద్భుతమైన భావోద్వేగ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని హీరోగా ఒక కొత్త సినిమా తెరకెక్కబోతుండగా.. ఇందులో రుక్మిణి హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు టాక్.
ఇది పూర్తిగా మనసుకు హత్తుకునే సున్నితమైన లవ్ స్టోరీ అని సమాచారం. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర చాలా బలంగా, ఎంతో ప్రాధాన్యతతో ఉండబోతుందట. ఆ పవర్‌ఫుల్ పాత్ర కోసం మేకర్స్ రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన ‘డ్రాగన్’ ప్రాజెక్ట్‌లో నటిస్తున్న ఈ భామ ఖాతాలో.. ఇప్పుడు నాని సినిమా కూడా చేరడం విశేషం. ఏకంగా టాలీవుడ్ స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్న రుక్మిణి వసంత్ క్రేజ్ చూస్తుంటే తెలుగులో ఆమె హవా త్వరలోనే మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394